24 నుంచి కీసరగుట్టలో క్రీడా పోటీలు

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 24 నుంచి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులు, యువకులకు గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. ఈనెల 24 నుంచి రెండురోజుల పాటు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ పోటీలు, 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు యువకులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 23లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేష్ 8106252751 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీశ్రీజ్ఞాన్ మందిర్ పాఠశాలలో బుధవారం జనహిత సేవా ట్రస్ట్, భారత్ వికాస్ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహించారు. పలువురు విద్యార్థులకు ఫోలిక్ యాసిడ్ మందులు అందజేసి, ఐరన్ శాతం తక్కువ ఉన్న విద్యార్థులకు వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి హిమోగ్లోబిన్ పెరిగేందుకు తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ సభ్యులు డాక్టర్ లలితారామన్, పురుషోత్తం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఐరన్ అధికంగా ఉండే పీచు పదార్థాలు, ఆకు, కూరగాయలు తీసుకుంటే ఐరన్ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, జనహిత సేవా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ నర్సింగ్‌రావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఔట్‌సోర్సింగ్ కార్మికుడి మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

కీసర: విద్యుదాఘాతంతో ఔట్‌సోర్సింగ్ కార్మికుడు మృతి చెందిన సంఘటన బుధవారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపల్లి ఆర్‌ఎల్‌నగర్‌లో చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి –భువనగిరి జిల్లా, రాయరావుపేటకు చెందిన లక్ష్మీనారాయణ(35) పోచారం మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా పని చేసేవాడు. జీతాలు సరిగా రావడం లేదని అక్కడ పని మానేసిన అతను ఆర్‌ఎల్‌నగర్‌లో ఉంటూ విద్యుత్ లైన్ మెన్ కింద తాత్కాలిక కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం ఆర్‌ఎల్‌నగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు ఉండటంతో లైన్‌మెన్ అతడిని పిలిపించాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ సరఫరాను ఆఫ్‌చేసే క్రమంలో అతని చేతిలో ఉన్న ఇనుప రాడ్ ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న 11 కేవీ తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల మృతి

మృతులు మేడ్చల్ జిల్లా గాగిల్లాపూర్‌కు చెందిన వారు





నరేశ్, శంకర్ మృతదేహాలు

జిన్నారం (పటాన్‌చెరు): చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన జిన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగలక్ష్మి కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లా గాగిల్లాపూర్‌కు చెందిన వల్లపు రాంబాబు కుమారుడు నరేశ్(26), వల్లపోలు రాజు కుమారుడు శంకర్ (22) ఇద్దరూ స్నేహితులు, వారు కూలీలుగా పని చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం జిన్నారం మండలం వావిలాలలో కల్లు తాగేందుకు బైక్‌పై వచ్చారు. తిరిగి వెళ్లే సమయంలో ఈత కొట్టేందుకు వావిలాల పీర్ల చెరువులోకి దిగారు. చెరువు ఎక్కువ లోతు ఉండడంతో ప్రమాదవశాత్తు మునిగిపోయారు. అక్కడే గేదెలు మేపుతున్న వ్యక్తి గమనించి చెరువులో దిగి కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. బుధవారం జగంపేట వావిలాల గ్రామాలకు చెందిన ఈతగాళ్ల సాయంతో పోలీసులు గాలింపు చేపట్టగా మధ్యాహ్నం మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ మేరకు జిన్నారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

డీసీసీ, డీఎల్‌ఆర్సీ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



క్రెడిట్ ప్లాన్ కరదీపికను ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తదితరులు

- పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ కరదీపిక ఆవిష్కరణ
- ప్రాధాన్యతా రంగాలకు వార్షిక రుణం అంచనా రూ.28157 కోట్లు



సమావేశానికి హాజరైన వివిధ బ్యాంకుల అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: ఆర్థిక సంవత్సర ముగిసేలోగా విద్యా, గృహ రుణాల లక్ష్యాలను పూర్తి చేయాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్, డీసీసీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన డీసీసీ, డీఎల్ ఆర్సీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మూడో త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ శాఖల ద్వారా ఆర్థిక సంవత్సర ముగింపులోగా విద్యా, గృహ రుణాల లక్ష్యాలను పూర్తి చేయాలని బ్యాంకర్లను సూచించారు. వార్షిక రుణ ప్రణాళిక కింద బ్యాంకుల పనితీరు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, ఎజెండా తదితర అంశాలపై ఆయన సమీక్షించారు.

కరదీపిక ఆవిష్కరణ

రాబోవు 2025–26 ఆర్థిక సంవత్సరానికి నాబార్డ్ ద్వారా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ కరదీపికను జిల్లా అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. నాబార్డ్ ప్రతి జిల్లాకు ఏటా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ పీఎల్‌పీని సిద్ధం చేస్తోంది. ప్రాధాన్యతా విభాగంలో మేడ్చల్ జిల్లాలో అందుబాటులో ఉన్న భౌతిక, ఆర్థిక సామర్థ్యాన్ని అంచనా వేస్తుంది. దీనిని ఆధారంగా చేసుకుని లీడ్ బ్యాంక్ జిల్లాలోని వివిధ బ్యాంకుల ద్వారా అమలు చేయడానికి జిల్లా వార్షిక రుణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. దీని ప్రకారం మేడ్చల్‌కు సంబంధించిన 2025–26 పీఎల్‌పీని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా ప్రరంభించారు.

ప్రాధాన్యతా రంగాలకు రూ.28157 కోట్లు

పంట ఉత్పత్తి, నిర్వహణ, మార్కెటింగ్ కోసం రుణం రూ.469.66 కోట్లు, వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాల కోసం టర్మ్ లోన్ రూ.893.53 కోట్లు, వ్యవసాయం మౌలిక సదుపాయాల కోసం రూ.246.31 కోట్లు, అనుబంధ కార్యకలాపాల కోసం రూ.1383.58 కోట్లు, సూక్ష్మ చిన్న , మధ్య తరహా సంస్థల కోసం రూ.23042.33 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగ రుణాలు , విద్య, హౌసింగ్, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రెన్యూవబుల్ ఎనర్జీ తదితర విభాగాలకు రూ.2121.73 కోట్లతో సహా జిల్లాలో మొత్తం ప్రాధాన్యతా రంగానికి రూ.28157.15 కోట్లు రుణ లక్ష్యంగా ప్రతిపాదనలు రూపొందించారు. సమావేశంలో నాబార్డ్ డీడీఎం అఖిల్,ఆర్బీఐ ఎల్‌డీఎం శివ ప్రసాద్, ఆర్బీఐ ఏజీఎం లక్ష్మీ శ్రావ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు వినోద్‌కుమార్ ,రూన్సీరాణి, బ్యాంక్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో అన్ని బ్యాంకులు చురుగ్గా రుణాలిచ్చి 100 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.

సెయింట్ పీటర్స్‌లో ఏఐపై సదస్సు



ఎన్‌ఐటీఓతో ఒప్పందం కుదుర్చుకుంటున్న సెయింట్ పీటర్స్ కళాశాల ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ ఫర్ సెక్యూరిటీ అండ్ సెక్యూరిటీ ఫర్ ఏఐ, డిజిటల్ ట్విన్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సీఎస్‌సీ, ఏఐఎంఎల్, ఆర్ అండ్ డి విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఎన్‌ఐటీ జైపూర్ అసోసియేట్ ప్రొఫెసర్ రమేశ్ బాబు మాట్లాడుతూ కంప్యూటర్ సెక్యూరిటీ సమస్యలు, సోషల్ మీడియాలో వచ్చే రీల్స్‌పై అవగాహన కల్పించారు. మనం చూసే సమయాన్ని బట్టి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వీడియోలను అందిస్తుందన్నారు. ఏఐకి సెక్యూరిటీ ఇవ్వడంలో డిజిటల్ ట్విన్ ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం జెఆర్‌ఎఫ్ అండ్ ఎన్‌ఐటీ జైపూర్ ఇంటెన్షిప్ ప్రాజెక్టుల్లో సెయింట్ పీటర్స్ కళాశాల విద్యార్థులు పనిచేసేలా ఒప్పదం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ టి వి రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్లు సరోజా రెడ్డి,అనురాగ్ రెడ్డి, కోఆర్డినేటర్స్ అమజాన్ షేక్, వెంకట్, పిఆర్‌ఓ రవి సుధాకర్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల్‌లో కేజీ టు పీజీ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య, జంగయ్యయాదవ్

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ పాఠశాల, జూనియర్ కళాశాల ఆవరణలో కేజీ టు పీజీ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

ఘట్‌కేసర్ జెడ్పీ బాలురు, బాలికల పాఠశాలను 26 ఎకరాల విస్తీర్ణంలోని గురుకుల్‌లో ఏర్పాటు చేయాలని, పాఠశాల స్థలాన్ని బస్‌స్టాప్‌కు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లేశ్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల వద్ద బుధవారం బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఫీజు విషయంలో అవమానించడంతో మనస్తాపానికి లోనైన 10వ తరగతి విద్యార్థిని అఖిల ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. విద్యార్థిని కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలంటూ బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా పాఠశాల యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలంటూ మృతురాలి తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో పాఠశాల యాజమాన్యం బుధవారం మధ్యాహ్నం నుండి పాఠశాలకు సెలవు ప్రకటించి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఆర్‌ఎం, డీఎం అందుబాటులోకి రాకపోవడంతో మూడు గంటల పాటు వారు ఆందోళన చేశారు. గురువారం మళ్లీ ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఏనుగు సుదర్శన్, మున్సిపల్ అధ్యక్షురాలు శైలజ, నాయకులు అర్జున్, ప్రేమ్‌దాస్, సుధాకర్‌రెడ్డి, మహేశ్, కృష్ణప్రియ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలం యాదవ్, బంటి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీలో ‘బడ్జెట్ టాక్’



బహుమతులు అందజేస్తున్న యూనివర్సిటీ డైరెక్టర్ నవీన్‌కుమార్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్, ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో బుధవారం బడ్జెట్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు రోజులుగా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ఎంబీఏ విద్యార్థులకు ఆర్థిక విధానాలు, బడ్జెట్ నిర్ణయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో బడ్జెట్ అంశాలపై చర్చలు, సమీక్షలు, ప్యానెల్ డిబెట్‌లు నిర్వహించారు. విద్యార్థులు మొదటి రోజు ముఖ్యమైన రంగాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి, బడ్జెట్ ముఖ్యాంశాలు తెలిసేలా ప్లకార్డులు, పోస్టర్లను ప్రదర్శించారు. రెండవ రోజు ప్యానెల్ చర్చలు, ఇంటర్వ్యూలు, ఇంటరాక్టివ్ ప్రజెంటేషన్లు జరిగాయి. ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్థిక నిపుణులు ఆంజనేయులు, సీఎఫ్‌ఓ కిశోర్ తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి, రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్, ఎంబీఏ విభాగం డైరెక్టర్ నవీన్‌కుమార్, హెచ్‌ఓడీ విద్యాసాగర్, సైదారావు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. అక్రమ నిర్మాణాలపై ఆందోళన చేపట్టేందుకు బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలు, పార్కులు, మాస్టర్ ప్లాన్‌లోని రహదారులు అన్యాక్రాంతమవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల వైఖరికి నిరసనగా పోచారం పురపాలక సంఘ కార్యాలయం ఎదుట రెండు రోజుల పాటు ఆందోళన చేపట్టాలని తీర్మానించామన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు చింతల యాదయ్య, ఎస్.సబిత, యాదగిరి, కొయ్యడ చంద్ర మోహన్, అరుణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా బీజేపీ రూరల్ అధ్యక్షుడు బుద్దిశ్రీనివాస్ అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా ఆయన దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పర్యటించారు. మున్సిపల్ పరిధిలోని సిద్దార్థనగర్, ఖుషిగార్డెన్, శివానందపురి, తిరుమల ఎన్‌క్లేవ్, గ్రీన్‌పార్క్ఎన్‌క్లేవ్, తదితర కాలనీల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత 20 ఏళ్లుగా తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, విఫలమయ్యారని, ప్రతి 5 ఏళ్లకు ఒకసారి పాలకులు మారడం తప్ప తమకాలనీల్లో సీసీరోడ్లు, మంచినీటిసౌకర్యం, వీధిదీపాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, పార్కుల అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. దీనిపై స్పందించిన బుద్దిశ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో జీఎం తనిఖీలు



రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న భాస్కర్‌యాదవ్

మేడ్చల్ రూరల్: మేడ్చల్ రైల్వే స్టేషన్‌ను బుధవారం సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే స్టేషన్‌లో సాగుతున్న ఆధునీకీకరణ పనులు, నూతన ప్లాట్‌ఫాం ఏర్పాటు, ఆర్‌యూబీ నిర్మాణం తదితర పనులను పరిశీలించారు. పనుల పురోగతి, ఎప్పటిలోగా పూర్తవుతాయి, పనుల నాణ్యతపై అధికారులను ఆరా తీశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ కొడె మహేశ్ తదితరులు జీఎంను కలిసి ఆర్‌యూబీ పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఏళ్ల తరబడి పనులు సాగుతుండడంతో ప్రజలు, విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బంది పడుతున్నారన్నారు. మేడ్చల్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని కోరారు.

బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పూజలు



స్వామి వారి సన్నిధిలో కాంగ్రెస్ నాయకులు


మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి బ్రహ్మసూత్ర పార్వతీ రాజరాజేశ్వర స్వామి కల్యాణ ఉత్సవాల్లో బుధవారం కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వజ్రేశ్‌యాదవ్ తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని మాజీ కౌన్సిలర్ సరిత మల్లేశ్ గౌడ్ దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రవణ్‌గుప్తా, మధుకర్, కొడె మహేశ్, దేవా, రాఘవేందర్‌గౌడ్, నవీన్‌రెడ్డి, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేకు సహకరించాలి

బోడుప్పల్: వివిధ కారణాల వల్ల గతంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేలో పాల్గొనని వారందరూ సారి నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొని అధికారులకు సహకరించాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాల లక్ష్మి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేలో భాగంగా బుధవారం ఆమె బోడుప్పల్‌లో పర్యటించారు. బోడుప్పల్ కమిషనర్ శైలజ, మల్కాజిగిరి జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, సర్వే సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈనెల 28 వరకు సర్వే కొనసాగుతుందని, గత సర్వేలో పాల్గొనని వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సర్వే నిర్వహించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ శ్యాంసుందర్, మేనేజర్ ప్రవీణ్, రెవెన్యూ అధికారులు విజయేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో, పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో, మర్పల్లిగూడలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు, శివాజీ యూత్ సభ్యులు పాల్గొన్నారు. –మేడ్చల్, మల్కాజిగిరి జోన్ బృందం



మర్పల్లిగూడలో..



ఎన్ఎఫ్‌సీనగర్‌లో..



అంబేడ్కర్ చౌరస్తాలో..



నాగారంలో..



మునీరాబాద్‌లో..



మేడ్చల్‌లో...



జగన్‌గూడలో..

నీటి సమస్య నివారణకు నిరంతర పర్యవేక్షణ

శివారుల్లో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

- వేసవిలో ప్రతిరోజూ మానిటరింగ్
- స్పెషల్ ఆఫీసర్ల నియామకం
- బోర్లు ,చేతిపంపుల మరమ్మతులు
- జీపీలు, పురపాలక సంఘాల్లో అదనపు వాటర్ ట్యాంకులు
- అవసరమైతే అద్దెకు తీసుకునేందుకు వ్యవసాయ బోర్ల గుర్తింపు



సాక్షి,సిటీబ్యూరో: నగర శివార్లలోని 13 పురపాలక సంఘాలు , 34 గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించనున్నారు. ఓఆర్‌ఆర్ (లోపలి)పరిధిలోని పురపాలక సంఘాలు, గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి జలమండలి ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందిస్తోంది.

3 డివిజన్లు / వార్డులకు ఒక ట్యాంకర్

నగర శివార్లలోని జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట నగరపాలక సంస్థలతో పాటు కొంపెల్లి, మేడ్చల్, దుండిగల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్కేసర్ మున్సిపాలిటీల పరిధిలోని 3 డివిజన్లు/ వార్డులకు ఒక వాటర్ ట్యాంకర్‌ను కేటాయించనున్నారు. అవసరాన్ని బట్టి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రైవేట్ కమర్షియల్ బోర్లతోపాటు పట్టణానికి సమీపంలో గుర్తించిన వ్యవసాయ బోర్లను కూడా ఉపయోగించుకునేలా కార్యాచరణ ఖరారు చేశారు. మంచి నీటి సరఫరా పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ గౌతమ్ పురపాలక సంఘాల కమిషనర్లతో సహా ప్రత్యేక అధికారులను నియమించారు. వీరందరూ జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)రాధికా గుప్తా నేతృత్వంలో పని చేయనున్నారు. ఎండలు అధికమవుతున్న నేపథ్యంలో పడిపోతున్న భూగర్భ జలాలను దృష్టిలో పెట్టుకుని గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, అపార్టుమెంట్లల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రైవేట్ కమర్షియల్ ట్యాంకర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అధిక జనాభా కలిగి ఉన్న జవహర్‌నగర్ కార్పొరేషన్‌తోసహా పురపాలక సంఘాల్లో మంచినీటి సమస్య తలెత్తకూడదన్న లక్ష్యంతో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అధికార యంత్రాంగం పేర్కొంది.

పంచాయతీల్లోనూ పకడ్బందీ చర్యలు

34 గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పంచాయతీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పంచాయతీల్లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు, వాటర్ ట్యాంకర్లు ఉన్నా, ప్రతి గ్రామానికి అదనంగా రెండేసి చొప్పున వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచినట్లు జిల్లా పంచాయతీశాఖ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే జూన్ వరకు మంచినీటి ఎద్దడి నివారణకు ఏ,బీ,సీ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించిన పంచాయతీ శాఖ అవసరాన్ని బట్టి అద్దెకు తీసుకునేందుకు పలు వ్యవసాయ బోర్లను గుర్తించినట్లు తెలిసింది. ఇందులో ఘట్కేసర్ మండలంలో 38, కీసరలో 12, ఎంసీపల్లిలో 32 , శామీర్‌పేటలో 45, మేడ్చల్ మండలంలో 42 వ్యవసాయ బోర్లు అద్దెకు తీసుకునేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ బోర్లు ఉన్న భూములు సర్వే నంబర్లతో సహా రైతుల ఫోన్ నంబర్లు తదితర వివరాలను జిల్లా అధికార యంత్రాంగం సేకరిస్తోంది.